# కోడలా, ఆలోచించు

- ప్రఫుల్ల చంద్ర

"కోడలా, ఆలోచించు" అంది సుభాషిణి. ఎప్పుడూ గంభీరంగా వుండే ఆమె స్వరంలో ఒకింత జీర... ఒకింత బాధ.

అర్చన చేయించి గుడి వెనక తోటలో పొగడ చెట్టు కింద కూర్చున్నారు అత్తా, కోడలూ. మనస్సు విప్పి విషయాలు మాట్లాడటానికే సుభాషిణి కోడల్ని వెంటబెట్టుకు వచ్చింది.

సాయం సమయం. సూర్యుడింకా అస్తమించలేదు. గుడిగంటల సుస్వరాన్ని పూల సువాసనలనూ మోసుకొస్తున్న గాలి బరువుగా వాళ్ళని తాకుతోంది.

నిజానికి సునీత కూడా గత వారం రోజులుగా ఆలోచిస్తూనే వుంది. పుట్టింటినీ, మెట్టినింటినీ బేరీజు వేసుకుంటూనే వుంది.

తను కాపురానికొచ్చిన తొలి రోజులనెప్పుడూ మరిచిపోలేదామె.

అది ఉమ్మడి కుటుంబం - మామగారి పేరు సుబ్రహ్మణ్యంగారు.

మంచితనమో, చేతగానితనమోగాని ఆయన పెద్దగా ఆస్తులేవీ సంపాదించకుండానే రిటైర్ అయ్యారు. తోటివారు రెండు చేతులా లక్షల్లార్జించి మేడలూ, మిద్దెలూ కట్టుకున్నా చలించలేదాయన.

"నా ఇద్దరు కొడుకులే నాకు కోట్లు! ఇంక లక్షలతో పనేమి?" అని నవ్వేసేవారాయన. "కొడుకులే కోట్లుగాని నేను అరకోటు కూడా కానా?" అని జోక్ చేసేది కూతురు సుస్మిత.

సుబ్రహ్మణ్యంగారి భార్య సుభాషిణి జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేస్తోంది. సమస్యలు లేని చక్కని సంసారం - అని ఆ కాలనీలో అంతా వాళ్ళని మెచ్చుకుంటూ వుంటారు.

కాపురానికొచ్చిన కొత్తలో - ఆ రోజు - సునీతే వంట చేసింది. కూరలో కారం కాస్త ఎక్కువైనట్టుంది.

"ఈ ముసలి ప్రాణం మీద ఎందుకమ్మా అంత కోపం?" అన్నారు మామగారు, నవ్వుతూ. అత్తగారు తన పక్షం వహించి సమర్థించినా మామగారు "ఈ రోజు ఎక్కువ కారం వేశావు కాబట్టి రేపు కూరలో అసలు కారం వెయ్యకు" అనేశారు. అందరూ ఘొల్లున నవ్వుతోంటే తన తల వాలిపోయింది.

భోజనం అయాక మామగారు లేచి తల నిమురుతూ "నిన్ను బాధపెట్టానా తల్లీ! నన్ను క్షమించు" అన్నారు ఆర్ద్రంగా.

"అయ్యో, ఎంత మాట!" అని నొచ్చుకుంది తను "నేనే పొరపాటు చేశాను. మీరే నన్ను క్షమించాలి"

"మనం అంతా ఒక కుటుంబం సునీతా! నీవు మా అమ్మాయి లాంటిదానివి. మన మధ్య క్షమాపణలు వద్దుగానీ... అందరూ హాయిగా కిలకిలలాడుతూ వుండాలని నా కోరిక. అందుకే ఏదో వాగుతూ నవ్విస్తూ వుంటాను. నువ్వు కూడా నా మీద జోక్‌లు వేయొచ్చు. నా ముక్కు చూశావా? ఈ ముక్కు మీద ఎన్నో కవితలు, జోక్‌లూ చెప్పేవారు మా ఆఫీసులో."

మళ్ళీ అందరూ నవ్వేశారు. వాళ్ళతోబాటు తనూ.

"ఒక్క విషయం జ్ఞాపకం వుంచుకో కోడలా! మన భారతీయ కుటుంబ వ్యవస్థ, మన సెంటిమెంట్స్, మన అనురాగబంధాలూ చాలా గొప్పవి. విదేశీయులు సైతం ఈ గొప్పదనాన్ని గుర్తించి భారతీయుల్ని వివాహం చేసుకోడానికి ముందుకొస్తున్నారు. అందుకని మనం అన్నివేళలా మనదైన ఈ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి తల్లీ."

సుస్మిత అల్లరిగా చప్పట్లు కొడుతూ "వన్స్ మోర్" అని అరిచింది.

"మళ్ళీ మొదలుపెట్టారూ?!" అందంగా విసుక్కుంది సుభాషిణి.

ఇదొక అద్భుత కుటుంబం - అనిపించిందా క్షణంలో సునీతకు. అదే తన పుట్టింటిలో అయితే - కారం ఎక్కువైనందుకు అమ్మ కూరగిన్నెను విసిరి కొట్టేది. వండిన వాళ్ళని తిట్టిపోసేది. ఆ రోజు ఇంటిలో ఎవరికీ మనశ్శాంతి లేకుండా చేసేది. ఇద్దరు కొడుకులూ చిల్లర పైసలతో సహా తెచ్చి జీతం అంతా తల్లి చేతిలో పోయవలసిందే. భార్య బర్త్‌డేకి జాకెట్ ముక్క కాదు కదా, రూపాయి పువ్వులు కొనడానికి కూడా ఆ కొడుకులకు స్వతంత్రం లేదు. చివరకు పెద్ద కొడుకు తెగించి బదిలీ చేయించుకుంటే ఆ రోజు - "తల్లిదండ్రుల్ని వదిలేసి పోయిన ఏ కొడుకూ బాగుపడలేదురా. పురుగులు పడి చస్తావురా" అని శాపనార్థాలు పెట్టింది కన్నతల్లి!


అమ్మ ప్రవర్తన చాలా దారుణంగా అనిపించినా తనెప్పుడూ ఆమెకు ఎదురుచెప్పలేదు. తనే కాదు, అందరికీ ఆమె అంటే భయమే. ఎవరూ ఎదురుచెప్పరు.

అయితే ఒక సుగుణం ఏమంటే - తన మీద అమ్మకు వల్లమాలిన ప్రేమ. తను తప్పు చేసినా, ఆ తప్పుని కప్పిపెట్టి తన పక్షం వహించి ఎదుటివారిని చీల్చి చెండాడే అమ్మ అంటే తనకూ ప్రేమే.

నిజానికి సునీతకు పుట్టింటిలో కంటే మెట్టినింటనే హాయిగా వుంది. ఇక్కడ ఎవరికివారు సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవిస్తూనే తమ వల్ల ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్త పడుతుంటారు.

పెద్ద కొడుకు సుమన్‌ది పై రాబడి లేని బ్యాంక్ ఉద్యోగం. ఇక చిన్న కొడుకు సుజన్ - డిగ్రీ కాలేజీలో లెక్చరర్. ఖాళీ సమయంలో కోచింగ్ సెంటర్‌లో ఒక గంట పని చేస్తూ బాగానే సంపాదిస్తున్నాడు.

సుబ్రహ్మణ్యంగారు కొడుకుల్ని ఎప్పుడూ డబ్బు అడగనే లేదు. జీతాలు రాగానే వాళ్ళే ఆయన బ్యాంక్ ఖాతాలో డబ్బు జమచేస్తారు - పెద్దవాడు రెండు వేలు, చిన్నవాడు మూడు వేలు. సుభాషిణి కూడా జీతం అంతా ఆయన ఖాతాలోనేవేస్తుంది. సుబ్రహ్మణ్యంగారే ఇంటి అవసరాలన్నీ చూస్తారు.



సుస్మితకు సంబంధాలు వస్తున్నాయి. సుబ్రహ్మణ్యం గారు కట్నం తీసుకోకుండా కొడుకుల కైతే వివాహాలు చేశాడుగాని కూతురు విషయం అలా కాదు కదా. కట్నంతో పెళ్ళి బడ్జెట్ రెండున్నర లక్షలు అయేట్టుంది. చూస్తే ఖాతాలో యాభై వేలే వుంది.

పెద్ద కొడుకు పాతిక వేలు, చిన్నవాడు యాభై వేలు ఇస్తామన్నారు. సుభాషిణికి ప్రావిడెంట్ ఫండ్ నుంచి యాభై వేల అప్పు లభించవచ్చు. మరి మిగిలిన డబ్బు?

"డబ్బు కోసమా మీ చింత? ఉన్నాము మేము మీ చెంత! తెచ్చెదము అప్పచేసి డబ్బుల మూంతో! అన్నారు కొడుకులిద్దరూ.

సుబ్రహ్మణ్యంగారు కొడుకుల పెద్ద బుద్ధికి మురిసిపోతే, సుస్మిత అన్నలవైపు ఆరాధనగా చూస్తూ వుండిపోయింది.

సరిగ్గా అప్పుడే ఆ యింట సుందరమ్మ అడుగుపెట్టింది.

ఆమె – సునీత కన్నతల్లి! సుజన్‌కి అత్తగారు!

వస్తూనే ఆమె పరిస్థితిని ఆకళింపుకుంది. ఉమ్మడి కుటుంబం కోసం తన అల్లుడు భోళాశంకరునిలా డబ్బు వెదజల్లడం ఆమెకు నచ్చలేదు.

తన కూతురికి తీరని ఆర్థిక అన్యాయం జరుగుతున్నట్టు భావించిన సుందరమ్మ కూతుర్ని కాపాడే బాధ్యత నెత్తిమీద మోపుకుని, ఏదో మిషతో నెలకొకసారి రావడం, వారం పది రోజులుండి కూతురికి హితబోధలు మొదలుపెట్టింది.

ఇంక తట్టుకోలేక సునీత "ఈ ఇంటి కోసం మీ అన్నగారి కంటే మీరు ఎక్కువ ఖర్చుపెట్టకండి" అంది భర్తతో. "ఇది నీకు పుట్టిన బుద్ధేనా?" అని ఖస్సుమన్నాడు సుజన్.

మొదటిసారిగా అతనిలో కోపం చూసిన సునీత ఏడ్చుకుంటూ అమ్మ వద్దకు వచ్చేసింది. "ఇంక నేను చక్రం తిప్పుతాను చూస్తూ వుండు" అని కూతురు వెన్ను తట్టి ధైర్యం చెప్పింది సుందరమ్మ.

నీ మొగుడు తక్కువ డబ్బు ఇస్తున్నాడు కాబట్టి ఇంటి చాకిరి అంతా నువ్వే చేయాలి. మా అమ్మాయి హోదాకి నువ్వు సరితూగవు – అన్న ధోరణిలో సుందరమ్మ – పెద్ద కోడలు సుమిత్రను సూటి పోటి మాటలతో – మొదట ఏకాంతంగాను, తర్వాత బాహాటంగానూ అవమానించడం మొదలుపెట్టింది.

ఇంక భరించలేక అత్తగారి వద్ద కన్నీళ్ళు పెట్టుకుంది సుమిత్ర.

ఓ రోజు సాయంకాలం కాలేజీ నుంచి వస్తూనే సునీత వున్న గది వద్ద ఆగి "సునీతా, గుడికి వెళ్దాం. పావు గంటలో తయారవు" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది సుభాషిణి. గదిలోని తల్లీకూతుళ్ళ గుసగుసలు ఆగిపోయాయి. భయం, భయంగా అమ్మ ముఖంలోకి చూసింది సునీత.

"ఎందుకే అంత భయం? న్యాయం మన పక్షాన వుంది. అంతవరకూ వస్తే వేరింటి కాపురం పెడతానని తెగేసి చెప్పు, ఇక్కడ నేను అల్లుడితో మాట్లాడుతానులే" అని ధైర్యం చెప్పింది సుందరమ్మ.

అర్చన అయ్యాక గుడి వెనక తోటలో పొగడ చెట్టు కింద కూర్చుని "కోడలా ఆలోచించు. భర్తతో సంప్రదించు. మంచీ చెడ్డా ఆలోచించుకొని స్వయంగా ఒక నిర్ణయానికి రండి. వేరే కాపురం పెట్టాలనుకుంటే అలాగే చేయండి. అందుకోసం ఇంటిలో కలతలు రేపి, సాటి స్త్రీ సుమిత్రను సూటిపోటి మాటలతో అవమానించడం మంచిది కాదమ్మా" అంది సుభాషిణి.

ఒక్క క్షణం గంభీరంగా గడిచాక దీర్ఘంగా నిట్టూర్చి –

"నేనూ ఒకింటి కోడల్నే సునీతా! ఉమ్మడి కుటుంబాల సమస్యలు నాకు తెలుసు. అత్తా, ఆడపడుచులు పెట్టే బాధలూ తెలుసు. నేనూ అనుభవించాను. అందుకే మన కుటుంబంలో అలాంటి సమస్యలు రాకూడదని, నేను బాధపడినట్టు నా కోడళ్ళు బాధపడకూడదనీ నా తపన. మన ఇంట్లో నీకేమీ సమస్యలు లేవనే అనుకున్నాను. కాని నా అభిప్రాయం తప్పేమో అని ఇప్పుడనిపిస్తోంది. చెప్పమ్మా, నేను గాని, సుస్మితగాని నీకు బాధ కలిగేటట్టు ప్రవర్తించామా?" అడిగింది సుభాషిణి.



"మా భవిష్యత్తు గురించి మాకు బెంగ లేదు సునీతా! కొడుకులు మాతో ఉంటే సంతోషమే. వాళ్ళు వేరే వెళ్ళిపోతామన్నా బాధలేదు. మనసారా ఆశీర్వ దిస్తాం. నిజం చెప్పాలంటే మీరు ఇల్లు విడచి వెళ్ళనే అక్కరలేదు. మేమే వెళ్లిపోవాలి. ఎందుకంటే మనం ఉంటున్న ఇల్లు మా స్వార్జితం కాదు. మా మామగారి స్వార్జితం. అది మనవలు సుమన్, సుజన్‌లకే చెందు తుంది. మాకు కాదు. అందుకని బాగా ఆలోచించి చెప్పు, మమ్మల్ని పొమ్మంటే అద్దె కొంప దొరకగానే వెళ్ళి పోతాం. ఓపిక ఉన్నంతకాలం స్వతంత్రంగా జీవిస్తాం. తర్వాత వృద్ధుల ఆలనా పాలనా చూసే ఆశ్రమం లోకి వెళ్ళిపోతాం. అంతేగాని కొడుకులకు, కోడళ్ళకు గుదిబండలుగా మాత్రం ఉండబోము"

"అత్తయ్యా! ఇంక చాలు!" అరిచింది సునీత.

***

గుడి నుంచి వచ్చిన అత్త, కోడలూ ఇంటిలో అడు గుపెట్టేసరికి అంతా చీకటిగా వుంది. కాని హాలులో మాటలు వినిపిస్తున్నాయి.

సుభాషిణి లైట్ వేసింది. హాలులో సుంద రమ్మ, సుజన్ ఏదో సీరియస్‌గా మాట్లాడుకుంటు న్నారు కాబోలు. వీళ్ళు రాగానే మౌనం వహించారు. వాళ్ళ వద్దకు వెళ్ళాలా వద్దా అని సంశయంలో పడ్డారు అత్త, కోడలూ.

భార్యను రమ్మని సైగ చేశాడు సుజన్. సునీత భయం భయంగా వెళ్ళి భర్త ప్రక్కనే కూర్చుంది. సుభాషిణి కాసేపు తటపటాయించి తన గదిలోకి వెళ్ళిపోయింది.

"సునీతా! నేనీ ఇంటి కోసం అన్నయ్య కంటే ఎక్కువ ఖర్చుపెట్టడం మీ అమ్మకిష్టం లేదట. మనం వేరింటి కాపురం పెడితే బొచ్చెడు మిగుల్చుకోవచ్చట. నీ అభిప్రాయం ఏమిటి?" సూటిగా అడిగాడు సుజన్. ఆ స్వరంలోని వెటకారం ఛెళ్ళున తగిలి తల వంచు కుంది సునీత.

"అత్తాశ్రీ! మీకు తెలుసో, లేదో – మీ చిన్న కొడుకు కూడా బదిలీ చేయించుకొని ఏ పొరపొచ్చాలూ లేని మీ బంధం నుంచి తప్పించుకు పారిపోయాడీరోజే. వెళ్ళి మనస్ఫూర్తిగా ఆశీర్వదించి రండి" వెటకారంగా అన్నాడు సుజన్.

ఏం చెప్పాలో, ఏం చెయ్యాలో తోచక బెంబేలు పడింది సుందరమ్మ.

"కూతురికి అన్యాయం జరిగిపోతోందన్న బెంగతో మీరు నెలనెలా ఇక్కడకొచ్చి ఆమె చెవి కొరుకుతున్నట్టే మీ వియ్యపురాలు కూడా మీరు ఇక్కడ వున్నప్పుడు మీ ఇంటికే వెళ్ళి తన కూతురి చెవి కొరకడం మొద లుపెట్టి విజయం సాధించింది. మగాళ్ళదేముంది? వాళ్ళు పెళ్ళాల కొంగుముడిలో విలవిలలాడే పిల్లులూ, బల్లులూ – అనే కదా మీ భావం? ఇప్పుడు నా పత్నిశ్రీ – వేరింటి కాపురం పెడదాం – అని ఆజ్ఞాపిస్తే గంగిరెద్దులాగ ఆమె వెనక పడిపోవలసినవాడినే కదా! నాకు వివేచన లేదు; సంస్కారం లేదు; సొంత ఆలో చన లేదు; పెళ్ళాం గీసిన గీటు దాటలేని అర్భకుణ్ణి! స్వయం నిర్ణయం తీసుకోలేని దద్దమ్మను! అంతే కదా నా గురించి మీ అంచనా? అందుకే కదా నెలనెలా వచ్చి కూతురి చెవి కొరుకుతున్నారు?"

సుజన్ స్వరం క్రమంగా పెరుగుతూ ఒక్కొక్క మాటా ఛెళ్ళు ఛెళ్ళున తగులుతోంటే తల వంచుకొని కన్నీళ్ళు పెట్టుకుంది సుందరమ్మ. గిరుక్కున భార్య వైపు తిరిగి –

"మీ ఇంటిలో మీ అమ్మ నిర్వాకం చూశావ్! ఈ ఇంటిలో మా అమ్మ నిర్వహణ చూశావ్. నీ కెవరు కావాలో కోరుకో సునీతా! చేతులు కట్టుకొని గ్యారం టీగా నీ నిర్ణయానికి కట్టుబడి వుంటా. శ్రీమతీ ఆలోచించు!" అన్నాడు సుజన్.

హాల్లో మాటలు గట్టిగా వినిపిస్తోంటే గాభరాగా వచ్చి అంత దూరంలో నిలబడిపోయింది సుభాషిణి. సునీత కళ్ళు తుడుచుకొని లేచి నిలుచుంది.

ఇటు – తలవంచుకొని రోదిస్తున్న అమ్మ!

అటు – తల ఎత్తుకుని గంభీరంగా నిలుచున్న అత్త!

కోడలా, ఆలోచించు! ఆలోచించి స్వయం నిర్ణయం తీసుకో – అన్న మాటలు ఆమె చెవిలో గింగురుమం టున్నాయి.

ఇంక ఆలోచించడానికేమీ లేదు. ఆమె ఒక నిర్ణయం తీసుకుంది!


ఈ దీపావళి తెలుగునాట శుభవర్షిణి, ధనవర్షిణి కావాలని కాంక్షిస్తూ...

కష్టమర్లకు, శ్రేయోభిలాషులకు
శుభాకాంక్షలు

కాంచీపురం వీవర్స్ సొసైటీ
పట్టుచీరలు
ఫ్యాన్సీ, శిల్క్ చీరల
కామధేనువు

ఫ్రెష్‌స్టాకు
సరికొత్త
డిజైన్లు



అంబికా షోరూమ్
A/C
ఓవర్ బ్రిడ్జి ప్రక్కన, మెయిన్‌రోడ్,
బ్రాడీపేట, గుంటూరు-2, Ph:232470-233681(R).

కంచి, ధర్మవరం, పోచంపల్లి, గద్వాల్, వెంకటగిరి, గిరిజ,
గాయత్రి, అపూర్వ, బెంగాలీకాటన్, మైసూర్ శిల్క్ చీరలు

KALYANI ADS, ✆ 230466